జాగ్రత్తలు పాటిస్తేనే మద్దతు

- జిల్లాలో జోరుగా వరి కోతలు
- బోనస్ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తే అవకాశం
- ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అధికారుల సూచన



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆలస్యంగా కురిసిన భారీ వర్షాల వల్ల రైతులు ఆగస్టు నెలకారు వరకు వరినాట్లు వేసుకున్నారు. ఇప్పుడిప్పుడే పంట దిగుబడులు వస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే మద్దతు ధర దక్కనుంది. జిల్లాలో ఐకేపీ పీఏసీఎస్, డీసీఎమ్మెస్, మెప్మా, ఏజెన్సీల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 18కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తుండగా, వారం రోజుల్లో మొత్తం 326 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. 1.60లక్షల ఎకరాల్లో నాట్లు వేయగా, 3.80లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో సన్న ధాన్యం రైతుల అవసరాలకు, ప్రైవేటుకు పోను 3.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు చెబుతున్నారు. రైతుల ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మద్దతు ధర లభించాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలని సూచిస్తున్నారు. నెలల కొద్ది పంటను కంటి రెప్పలా కాపడుకొని, దిగుబడులు వచ్చే సమయంలో సూచనలు పాటించకుండా వరికోత కోయడం, సూర్పిడి పట్టడం, ఆరబోయకుండా ధాన్యాన్ని మార్కెట్ తీసుకెళ్లడం, తదితర జాగ్రత్తలు వహించకపోవడం మూలంగా గిట్టుబాటు ధర రాక నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. చిన్న జాగ్రత్తలు పాటిస్తే మంచి ధర లభిస్తుందని జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి వివరిస్తున్నారు.

గ్రేడును బట్టి ధర..

వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానికి ప్రభుత్వం రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర దక్కనుంది. కనీస మద్దతు ధర దక్కాలంటే రైతులు ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం సేకరణ కోసం ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుంది.

అధికారుల సూచనలు..

- వరి గింజలు బంగారు రంగులోకి వచ్చిన తర్వాతే కోతలు ప్రారంభించాలి.
- వరి కోతకు ముందు పొలంలో ఉన్న కల్తీ మొక్కలను తీసి వేయాలి.
- కోతకు 15 నుంచి 20రోజుల ముందే నీటి తడులు ఆపివేయాలి.
- 1010 వంటి రకం వరి బంగారం వర్ణంలోకి వచ్చే వరకు ఆగితే గింజలు రాలిపోతాయి. ఈ ఒక్క రకాన్ని మాత్రం గోదుమ రంగులోకి రాగానే కోయాలి.
- కోసిన వరి మెదలను నాలుగు రోజుల పాటు ఎండనివ్వాలి.
- అనంతరం ఒక్కో రకం వరికి వేరువేరు కల్లాలు చేసి, టార్పిలిన్‌లలో వరి మెదలు వేసి ట్రాక్టర్ల ద్వారా సూర్పిడి చేయాలి.
- ఒక రకానికి చెందిన వరి ధాన్యాన్ని మరోరకం వరి ధాన్యంతో కలుపరాదు. పొలం వద్దే సరైన గ్రేడింగ్ చేయాలి.
- గడ్డిని తీసివేసి గింజలు కుప్పగా పోసి గాలి పంకల సాయంతో (తాలు గింజలు) నాణ్యత లేని గింజలు లేకుండా శుభ్రంగా తూర్పార పట్టాలి.
- ఆరబోసిన ధాన్యాన్ని 17శాతం లోపు తేమ ఉండే వరకు ఆరబెట్టి మార్కెట్ తీసుకెళ్తే గిట్టుబాటు ధర వచ్చే అవకాశాలు ఉంటాయి.
- హార్వెస్టర్‌తో కోస్తే మొదటి సారి పోసే డబ్బాను వేరుగా పోయాలి. ఆ తరువాత కోసినవవి ఒకచోట పోయాలి. ఇలా చేయడం ద్వారా కల్తీ ప్రమాదం తప్పుతుంది. వరి గింజలు సిమెంట్ కల్లాలపై లేదా టార్పాలిన్ షీట్లపై ఆరబెట్టాలి. రెండుమూడు రోజులు బాగా ఎండేలా పారతో, కాళ్లతో కలియ దొబ్బాలి. పంట కోశాక సరిగ్గా ఆరబెట్టకపోతే గింజలు రంగుమా రి, పంట నాణ్యత తగ్గే అవకాశం ఉంది.
- పంటను ఆరబెట్టే సమయంలో రాళ్లు, మట్టి పెళ్లలు, చెత్త, చెదారం వంటి వ్యర్థ పదార్థాలు చేరకుండా జాగ్రత్త వహించాలి.
- నిల్వ చేసే పక్షంలో గోనె సంచులను కింద వేయకుండా కవర్లు పరిచి లేదా బల్లలపై బస్తాలు నెట్టుగా వేయాలి.
- పురుగులు ఆశించకుండా లీటరు నీటికి 5ఎంఎల్ మలాథియన్ మందును కలిపి బస్తాలపై పిచికారీ చేయాలి.
- ఎలుకల నుంచి రక్షించుకోవడానికి బస్తాల నెట్టుల మధ్య జింక్ పాస్ఫెట్ ట్యాబ్‌లెట్లు ఉంచాలి. ఒక రోజు తలుపులు పూర్తిగా మూసివేసి గాలి చొరబడకుండా జాగ్రత్తలు వహించాలి. ఇలా చేయడంతో ఎలుకలు లేకుండాపోతాయి. మరుసటి రోజు నుంచి తలుపులు తీయవచ్చు.

క్లుప్తంగా

వసతి గృహాల సందర్శన



రేషన్ సరుకులు పరిశీలిస్తున్న అనిత

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని కస్తూరిబా, మోడల్ స్కూళ్లలోని వసతి గృహాలను మండల ప్రత్యేకాధికారిని, జిల్లా ఉద్యానవన అధికారిని అనిత సోమవారం ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి సందర్శించారు. వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

మందమర్రిరూరల్: ఈ నెల 17, 18న జరిగే గ్రూపు–3 ఎంట్రెన్స్ పరీక్షలకు మందమర్రి వ్యాప్తంగా 7పరీక్షా కేంద్రాలు ఎంపికయ్యాయి. కార్మెల్ హైస్కూల్, సింగరేణి హైస్కూల్, సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల, తెలంగాణ మోడల్ స్కూల్, శ్రీ చైతన్య హైస్కూల్, లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, తవక్కల్ హైస్కూల్ సెంటర్లను సోమవారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్‌తో కలి సి సౌకర్యాలను పరిశీలించారు. మందమర్రి వ్యాప్తంగా 2064మంది అభ్యర్థులు ఎంట్రెన్స్ పరీక్ష రాయనున్నట్లు సీఐ తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బోయపల్లి గ్రామ శివారులోని వెలుమల వానికుంటలో సోమవారం రాత్రి ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసిన చేపపిల్లలను కుంటలో వదిలారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ సాంబశివరావు, ఏఐఎం రాందాని, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కంపెల చిన్నయ్య, నాయకులు, మత్స్యకారులు, అధికారులు పాల్గొన్నారు.

టెండర్లు లేకుండానే పనులు..?



డ్రెయినేజీ నిర్మాణం కోసం తవ్విన గుంత

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని మార్కెట్ రోడ్డులో టెండర్లను నిర్వహించకుండానే డ్రెయినేజీ పనులను చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. గతంలో మార్కెట్ రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణం కోసం రూ.5లక్షల నిధులు కేటాయించారు. ప్రస్తుతం డ్రెయినేజీ నిర్మాణానికి ఎంత మేర నిధులు అవసరం అవుతాయనే అంచనా లేకుండా, డీపీఆర్‌ను సిద్ధం చేయకుండా, టెండర్లను నిర్వహించకుండానే డ్రెయినేజీ పనుల కోసం తవ్వకాలను చేపట్టారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ డీఈ మసూద్ అలీని వివరణ కోరగా, గతంలో రూ.5లక్షల నిధులను కేటాయించామని, డీపీఆర్‌ను సిద్ధం చేసి, టెండర్లను నిర్వహిస్తామని తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో అనుమతి లేకుండా అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారని వీటి విషయంలో, చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేష్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(ఆర్‌డీఎంఏ) కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు.

అబుల్ కలాం జయంతి



కోటపల్లి/చెన్నూర్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చెన్నూర్ మైనార్టీ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, చెన్నూర్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, ప్రిన్సిపాల్ గోపి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు

చెన్నూర్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, నిత్యావసర సరుకుల స్టోర్ రూమ్స్, పరిసరాలు, రిజిష్టర్లతో పాటు ప్రాథమిక ఆరోగ్య కిట్లను పరిశీలించారు. కస్తూర్బా పాఠశాలలో తరగతి గదుల్లో ఫ్లోరింగ్, తలుపులు సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు డీఈ, కాంట్రాక్టర్లను పిలిపించి వెంటనే రెండు రోజుల్లో ఫ్లోరింగ్, డోర్లు అమర్చాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, ప్రిన్సిపాల్ సుమలత పాల్గొన్నారు.

సర్వే తనిఖీ



కస్తూర్బా పాఠశాలలో భోజనం పరిశీలిస్తున్న డీపీవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని దబ్బెటిగూడెంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సోమవారం జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. సర్వే ఎలా కొనసాగుతుందని పరిశీలించారు. గ్రామాల్లో రోడ్లపై ప్లాస్టిక్ వ్యర్థాలు పడేయకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో అజ్మత్‌అలీ, పంచాయతీ కార్యదర్శి చెన్న మధుకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కాసిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి మార్నేని మణికంఠ 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు సోమవారం కళాశాల పీడీ బాబురావు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. జట్టు విశిష్ట విజయం సాధించడంపై ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపక బృందం విద్యార్థిని అభినందించారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థితో ప్రిన్సిపాల్, పీడీ

కనుల పండువగా దీపోత్సవం



రామాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

జన్నారం: మండల కేంద్రంలోని రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్తిక మాసం పురస్కరించుకొని కనుల పండువగా దీపోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజశేఖర్, సభ్యులు సుధాకర్, సత్తయ్య, తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో భక్తులరద్దీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా రెండో సోమవారం ఉదయం నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నరహరిశర్మ, శ్రీకేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దండేపల్లి: మండలంలోని నంబాల నుంచి అక్రమంగా మినీవ్యాన్‌లో రేషన్‌బియ్యం తరలిస్తున్న వాహనాన్ని బీజేపీ నాయకులు గూడెం సమీపంలో సోమవారం రాత్రి అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కొనసాగుతున్న సర్వే

భీమారం: మండలంలో సర్వే సోమవారం కొనసాగింది. మద్దికల్, ఎలేశ్వరం గ్రామాల్లో సర్వేలో తహసీల్దార్ సదానందం పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సర్వేలో విధిగా పాల్గొని వివరాలు అందజేయాలని ప్రజలను కోరారు. భీమారంలో జరిగిన సర్వేలో పంచాయతీ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

రివైజ్డ్ పెన్షన్ అమలు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో 11వ వేజ్‌బోర్డు పరిధిలో రిటైర్డ్ ఉద్యోగులకు రివైజ్డ్‌పెన్షన్ అమలు చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేశ్, సత్తయ్య, పాగాకు రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు లాభాల వాటా, దీపావళి బోనస్ చెల్లించాలన్నారు.

బీసీ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: సింగరేణి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్కే 6 గని కమిటీని సోమవారం ఎన్నుకోగా కన్వీనర్‌గా కారుకూరి నగేశ్, కో కన్వీనర్‌గా సైదం చిరంజీవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పేరం రమేశ్, నాయకులు ముస్కె సమ్మయ్య, పాగాకు రమేశ్, బరుపటి మారుతి, గోల్ల సంతోశ్, సాయిల శ్రీనివాస్, నరసయ్య, రమేశ్‌లు పాల్గొన్నారు.

'అధికారుల తీరు సరికాదు'



మాట్లాడుతున్న మల్లేశ్

కాసిపేట: కార్మికులను 16మస్టర్లు పూర్తి చేయాలనడం హేయమైన చర్య అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ తెలిపారు. కాసిపేట గనిపై సోమవారం మాట్లాడారు. ముమ్మాటికి అధికారుల తీరు సరికాదని యాజమాన్యం ఇలాంటి చర్యలకు పూనుకోకుండా, వంద మస్టర్లు లేని కార్మికులకు కౌన్సెలింగ్ చేసి డ్యూటీకి వచ్చేలా చూడాలన్నారు. ఈ విషయాన్ని ఏఐటీయూసీ పక్షాన అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు, సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి రాజేందర్, సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులు రాణించాలి

శ్రీరాంపూర్: మహిళా ఉద్యోగులు విధి నిర్వహణలో రాణించాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి ఎస్‌వోటు జీఎం శ్రీధర్‌రావు తెలిపారు. ఆర్కే 5 గని, ఆర్కే 7గనుల్లో పనిచేస్తున్న మహిళా బదిలీ వర్కర్లకు, జనరల్ మజ్దూర్లకు సోమవారం ఆర్కే 5 గనిపై సర్వేస్‌లోని 16 డిజిగ్నేషన్లలో ఉన్న ఉద్యోగాల గురించి తెలిపారు. ఈ డిజిగ్నేషన్లలో ఉండే పని విధానం వివరించారు. కంపెనీలో ప్రతి డిజిగ్నేషన్ ముఖ్యమైందేనన్నారు. వీటిని ఎంచుకున్న తరువాత శిక్షణ ఇచ్చి లెటర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవి, డీవైసీఎంఓ పీ రమేశ్‌బాబు, గనిమేనేజర్ సుధీర్‌కుమార్, గని రక్షణాధికారి రాందాస్, సంక్షేమ అధికారులు రణదీప్‌గౌడ్, సంతస్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరవిందరావు

డ్యూటీలకు సక్రమంగా హాజరు కావాలి

శ్రీరాంపూర్: గైర్హాజరు ఉద్యోగులు ఇకనైనా డ్యూటీలకు సక్రమంగా హాజరు కావాలని ఏజెంట్ శ్రీధర్ తెలిపారు. ఆర్కే 5 గనిపై సోమవారం గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించి, సక్రమంగా డ్యూటీలకు రావాలన్నారు. చిన్నచిన్న కారణాలతో డ్యూటీలకు ఎగనామం పెట్టొద్దన్నారు. గైర్హాజరు వల్ల ఉద్యోగులతో పాటు సంస్థకు బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లుతుందన్నారు. గనిలో 125మంది 75మస్టర్ల కంటే తక్కువ చేసిన వారు ఉన్నారని తెలిపారు. కంపెనీ నిబంధనల ప్రకారం నిర్దిష్ట మస్టర్లు చేయకుంటే ఉద్యోగాల నుంచి తీసేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్‌కుమార్, రక్షణాధికారి రాందాస్, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, అడిషనల్ మేనేజర్ శివయ్య, ఫిట్ సెక్రెటరీ నర్సింగరావులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏజెంట్ శ్రీధర్

మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి శాంతిఖని గని ఆవరణలో ప్రతిష్ఠించిన మైసమ్మ తల్లి దేవాలయం తృతీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. గని అధికారులు, కార్మికులు భక్తి శ్రద్ధలతో అభిషేకం, గణపతి పూజ, కలశ స్థాపన ప్రత్యేక పూజలు చేసి చండీహోమం నిర్వహించారు. అనంతరం సామూహిక అన్నదానం చేశారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా ఇన్‌చార్జి జీఎం రాందాస్, ఎస్‌వోటు జీఎం విజయప్రసాద్, ఏరియా ఇంజినీర్ వెంకట రమణ, ప్రాజెక్టు అధికారి అబ్దుల్ ఖదీర్, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, రక్షణ అధికారి రాజు, ఫిట్ ఇంజినీర్ విద్యాసాగర్, ఇంజినీర్ రాంసాగర్, అండర్ మేనేజర్లు సంతోష్, నాగవర్ధన్, పూర్ణచందర్, గని సంక్షేమ అధికారి సత్యనారాయణ, ఏఐటీయూసీ కార్మిక సంఘం ప్రతినిధి తిరుపతి గౌడ్, ఇతర సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, కార్మిక నాయకులు

సమాచారం

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు యథాతథం

తాండూర్: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధి తాండూర్ మండలం రేపల్లెవాడ శివారులో ఉన్న ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులో మంగళవారం నుంచి పత్తి కొనుగోళ్లు యథాతథంగా జరుగుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాలతో సమావేశం ఏర్పా టు చేసి అధికారులు చర్చలు జరిపినట్లు తెలి పారు. ఈ చర్చల్లో సీసీఐ ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలుపై జిన్నింగ్ మిల్లర్ల అభ్యంతరాలను చర్చించి పరిష్కరించినట్లు తెలిపారు. ఈ మేరకు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి క్రయవిక్రయాలు చేపట్టడానికి మార్గం సుగమైందని తెలిపారు. రైతులు సేకరించిన పత్తిని అమ్మకానికి తీసుకురావాలని ఆయన కోరారు.

14న జోనల్‌స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 14న అండర్–14 బాలికల వాలీబాల్ పోటీలు రెబ్బనపల్లి జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫనిరాజు తెలిపారు. జిల్లా స్థాయిపోటీల్లో ఎంపికైన క్రీడాకారులు హాజరుకావాలన్నారు.

జాబ్‌మేళాతో ఉద్యోగావకాశాలు

మందమర్రిరూరల్: వివిధ సంస్థల నిర్వాహకులు నిర్వహించే జాబ్‌మేళాతో స్థానిక నిరుద్యోగ యువతకు అంప్రెటిషిప్ ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఐటీఐ ప్రిన్సిపాల్ దేవానంద్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీఐలో సోమవారం నిర్వహించిన అంప్రెటిషిప్ జాబ్‌మేళాకు వివిధ సంస్థల నుంచి ప్రతినిధులు హాజరై 54మందిని ఎంపిక చేశారు. త్వరలో ఎంపికైన అభ్యర్థుల వివరాలు తెలియజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అవసరాన్ని బట్టి అప్రెంటిషిప్, జాబ్‌మేళాలు నిర్వహిస్తామని ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీ కార్యనిర్వాహక సమావేశం

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణ బీజేపీ కార్యశాల సమావేశం సోమవారం జరిగింది. పట్టణ బీజేపీ అధ్యక్షురాలు దార కల్యాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు అందుగుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణ తదితరులు హాజరయ్యారు.

ఆకట్టుకున్న ఫ్రెషర్స్ డే

మందమర్రిరూరల్: వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కళాశాల(మంచిర్యాల) విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమం మండలంలోని అందుగులపేట గ్రామ శివారులోని ఓ ప్రైవేట్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూ ల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్‌రావు హాజరయ్యారు.

పాఠశాల అభివృద్ధి కోసం విరాళం

భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం ఆ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లుకి సోమవారం రూ.10వేల నగదు అందజేశారు.

రజక సంఘం పట్టణ కార్యవర్గం

జన్నారం: మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ పట్టణ కార్యవర్గాన్ని సోమవారం నియమించారు. అధ్యక్షుడిగా నల్లురి పెద్దన్న, కార్యదర్శిగా కుదురుపాక నరేశ్, ఉపాధ్యక్షులుగా సట్ల భీమయ్య, కొమురయ్య, కోశాధికారిగా సత్యం, సలహాదారులుగా ముక్కెర మల్లేశ్, గంగన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సన్మానం

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ పంచాయతీ కార్యదర్శిగా ఎనిమిదేళ్లు పనిచేసిన సత్తయ్య ఇటీవల బదిలీ కావడంతో, ఆయనను జీపీ కార్యాలయం వద్ద మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని ముత్యంపేట, చింతపల్లి, తానిమడుగు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, వైస్‌చైర్మన్ ఆరీఫ్, తహసీల్దార్ సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు.

పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: మాలల మహా పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక ఐబీ ఆవరణలో ఆవిష్కరించారు.